# సాక్షి నల్లగొండ

ఆదివారం । 13 । జూలై । 2025






## ఆదర్శప్రాయుడు 'దొడ్డా'

కమ్యూనిస్టు యోధుడు దొడ్డా నారాయణరావు ఆదర్శప్రాయుడని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. - 8లో



## తరలివచ్చిన భక్తులు

యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రంలో భక్తజన కోలాహలం నెలకొంది. భక్తులు వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలి వచ్చారు. - 8లో

## సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 590 అడుగులు

| | | |
|---|---|---|
| ప్రస్తుత నీటి మట్టం | : | 548.60 అడుగులు |
| ఇన్‌ఫ్లో | : | 62,4800 క్యూసెక్కులు |
| అవుట్ ఫ్లో | : | 1,650 క్యూసెక్కులు |
| విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా | : | 4,144 |
| కుడికాల్వ ద్వారా | : | నిల్ |
| ఎడమకాల్వ ద్వారా | : | నిల్ |
| ఏఎమ్మార్పీకి | : | 1,650 క్యూసెక్కులు |
| వరద కాల్వకు | : | నిల్ |

## న్యూస్‌రీల్

### రేపు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు రాక

నల్లగొండ టూటౌన్ : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు ఈనెల 14 ఉదయం 11:30గంటలకు నల్లగొండ పట్టణానికి రానున్నారని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. వివిధ ఆలయాల్లో పూజల అనంతరం మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట వరకు బీజేపీ కార్యాలయంలో పార్టీ కార్యకర్తలతో సమావేశం తర్వాత మీడియా సమావేశంలో పాల్గొంటారని పేర్కొన్నాయి.

### వాట్సాప్ లింక్‌లతో అప్రమత్తంగా ఉండాలి

నల్లగొండ: వాట్సప్, టెలిగ్రామ్, సోషల్ మీడియా ద్వారా పంపే నకిలీ మొబైల్ అప్లికేషన్ లింక్‌లతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వాటిని క్లిక్ చేసి మోసపోవద్దని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఒక ప్రకటనలో తెలిపారు. కొంత మంది సైబర్ నేరగాళ్లు పీఎం కిసాన్, ఎస్‌బీఐ రివార్డు పేరుతో ఏపీకే ఫైల్స్ పంపుతున్నారని పేర్కొన్నారు. ప్రజలు తమ వ్యక్తిగత సమాచారం, బ్యాంకు వివరాలు, ఓటీపీ ఎవరితోనూ షేర్ చేయకుండా ఉండాలని తెలిపారు. ఈ సమాచారం ప్రభుత్వ సంస్థలు అడగవని గమనించాలని, ఇలాంటి ఘటనలు జరిగితే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు.

### 15లోపు 'ఓపెన్' పరీక్ష ఫీజు చెల్లించాలి

రామగిరి(నల్లగొండ): డాక్టర్ బీఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ఎంబీఏ, ఎంబీఏ హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో అడ్మిషన్ పొందేందుకు నిర్వహించే ప్రవేశ పరీక్ష ఫీజు ఈనెల 15వతేదీ లోపు చెల్లించాలని ఎన్జీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ఉపేందర్, కోఆర్డినేటర్ డాక్టర్ బి.అనిల్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ కోర్సులో చేరాలంటే ఐసెట్ కాని, యూనివర్సిటీ నిర్వహించే ప్రవేశ పరీక్షలో తప్పనిసరిగా ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు www.braouonline.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

# పచ్చని బంధం

### ఇళ్లలోనే తీరొక్క మొక్కలు

- ఆకు కూరల నుంచి అరుదైన విదేశీ జాతుల వరకు పెంపకం
- ప్రాణంగా భావిస్తున్న యజమానులు
- రోజూ నాలుగైదు గంటలు మొక్కల సంరక్షణకే కేటాయింపు
- హరితవనాల్లా నివాసగృహాలు

వారికి ప్రకృతి అంటే ప్రాణం.. పచ్చని చెట్లే నేస్తాలు.. వారి ధ్యాసంతా మొక్కల పెంపకంపైనే.. తమ ఇళ్ల ఆవరణలను పచ్చదనంతో నింపేశారు. పూలు, పండ్లు, కూరగాయలు, ఔషధ మొక్కలు, ఎయిర్ ఫ్రెషనర్‌లాంటి అరుదైన జాతుల మొక్కలు పెంచుతూ నందనవనాల్లా మార్చేశారు. ఆహ్లాదకర వాతావరణాన్ని సృష్టించి పర్యావరణ పరిరక్షణకు పాటుపడుతున్న ప్రకృతి ప్రేమికులపై ప్రత్యేక కథనాలు.

సండే స్పెషల్

### హరితార్చనలో పూజారి

రాజాపేట : యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండల కేంద్రానికి చెందిన వైర్యాగం చంద్రశేఖర్ శర్మకు మొక్కలంటే ప్రాణం. మూడు దశాబ్దాలుగా మహాయజ్ఞంలా మొక్కలను పెంచుతున్నాడు. 465 గజాల ఇంటిలో 200కు పైగా మొక్కలు పెంచుతూ ఉద్యానవనంలా మార్చేశారు. వృత్తిరీత్యా పురోహితుడైన చంద్రశేఖర్‌శర్మ ఏటా తీర్థయాత్రలకు వెళ్తుంటాడు. అక్కడ వన మూలికలు, పూలు, పండ్ల మొక్కలు కొనుగోలు చేసి ఇంటితో పాటు ఆలయ ఆవరణతో నాటి పెంచుతున్నాడు. శివాలయంలో పూజారిగా, పౌరోహితం చేస్తూనే రోజూ కనీసం నాలుగైదు గంటలైనా మొక్కల సంరక్షణకు సమయం కేటాయిస్తారు. ఏటా వన మహోత్సవం కార్యక్రమంలో మొక్కలు నాటి ప్రకృతిపై తనకున్న ప్రేమను చాటుకుంటున్నాడు.

**చంద్రశేఖర్‌శర్మ పెరటిలో పెంచుతున్న మొక్కలు**

అశ్వగంధ, శతావరి, ఏక బిల్వం, బిల్వపత్రం, ద్వాదశబిల్వం, రణపాల, ఉసిరి, చెరుకు, పసుపు, రామ సీతాఫలం, జమ్మి, నాగ గరుడ, పంచ పాండవులు, ఉమ్మెత్త, మాచి, పనస, రుద్రాక్ష, జమ్మి, ఉసిరి, నిమ్మ, దానిమ్మ, మునగ, వెలగ, డ్రాగెన్.. ఇలా మరెన్నో రకాల మొక్కలను పెంచుతున్నాడు. ఇందులో రుద్రాక్ష మొక్కలు ఒక్కటి రూ.12వేలు, ద్వాదశ బిల్వ మొక్కలను ఒక్కోటి రూ.2వేల చొప్పున చెల్లించి కొనుగోలు చేశాడు.



తన ఇంటి ఆవరణలో నాటిన మొక్కల మధ్య చంద్రశేఖర్‌శర్మ

### ఉద్యానవనం.. ఆ నివాసం

రామగిరి(నల్లగొండ): పర్యావరణానికి మేలు కలిగేలా మొక్కలను పెంచుతున్నారు నల్లగొండ పట్టణానికి చెందిన వంగూరి భాస్కర్. ఆయన వృతిపరంగా ప్రభుత్వ ఉద్యోగి. 30 సంవత్సరాలుగా తన ఇంటి ఆవరణలో రకరకాల మొక్కలను పెంచుతూ ఇంటిని ఉద్యానవనంగా మార్చారు. ఇంట్లో ఖాళీ స్థలం అంటూ కనిపించదు. దాదాపు 200 పైగా మొక్కలు పెంచుతున్నారు. అందులో కొన్ని ఔషధ మొక్కలు, ఎయిర్ ఫ్రెషనర్స్, పూల మొక్కలు, అరుదైన జాతుల మొక్కలు ఉన్నాయి. పర్యావరణానికి మేలు జరిగేలా మొక్కలు పెంచుతూ నలుగురికి స్ఫూర్తినిస్తున్నారు.

**మొక్కల పెంపకంతో మానసిక ప్రశాంతత**

మొక్కల పెంపకంతో మానసిక ప్రశాంతంగా లభిస్తుంది. చుట్టూ చెట్లు ఉంటే అక్కడ వాతావరణం చల్లగా ఉంటుంది. రోజు ఉదయం పూట కాసేపు చెట్లకు నీరు పోయడం వల్ల రోజంతా ఉల్లాసంగా ఉంటుంది. సోషల్ మీడియాతో గడిపే సమయం వృథా చేయకుండా మొక్కలు పెంచితే మనకూ పర్యావరణానికి మేలు జరుగుతుంది. – వంగూరు భాస్కర్, నల్లగొండ



మొక్కలకు నీరు పెడుతున్న భాస్కర్

### ప్రకృతి ప్రేమికుడు.. పొన్నూరు సుబ్బారావు



సుబ్బారావు నివాసంలో వివిధ రకాల మొక్కలు



పొన్నూరు సుబ్బారావు, రిటైర్డ్ అధ్యాపకుడు, మిర్యాలగూడ

మిర్యాలగూడ టౌన్ : రిటైర్డ్ అధ్యాపకుడు, మానవ హక్కుల వేదిక రాష్ట్ర నేత పొన్నూరు సుబ్బారావు ఇల్లు వివిధ రకాల మొక్కలతో నందనవనంలా కనిపిస్తూ చూపరులకు ఆహ్లాదం పంచుతోంది. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేసి విరమణ పొందిన సుబ్బారావు వయస్సు ప్రస్తుతం 91 ఏళ్లు. మిర్యాలగూడ పట్టణంలోని శాంతినగర్‌లోని ఆయన నివాసంలో సుమారు 50 రకాలకు పైగా మొక్కలను పెంచుతూ ఇంటిని ఒక నందనవనంగా మార్చారు. వయో భారం అయినప్పటికీ కొంత స్వయంగా మొక్కలకు నీళ్లు పోయడంతో పాటు ఇతరులతో మొక్కల పనిచేయిస్తూ తన ఇంటిని నందనవనంలా మార్చేశారు.

### చిన్న అడవినే పెంచారు..



భువనగిరి: ఇంటినిండా మొక్కలు పెంచుకుంటారు చాలా మంది. కానీ, ఆ ఇంట్లో మొక్కల వనాన్నే సాగు చేస్తున్నారు. ఒకటా, రెండా 68 రకాల మొక్కలకు నెలవు. భువనగిరిలోని స్రిగ్దకాలనీకి చెందిన దిడ్డి బాలాజీ– డాక్టర్ జయశ్రీ దంపతులు.. నర్సరీలు, మరెక్కడైనా కొత్త రకం మొక్కలు కనిపిస్తే వాటిని తీసుకువచ్చి తమ ఇంటి ఆవరణలో నాటుతారు. ఇందులో న్యూజిలాండ్ నుంచి తెచ్చిన మొక్కలు సైతం ఉన్నాయి. తమ ఇంటి స్థలంలో సుమారు 600 గజాలు మొక్కలకే కేటాయించడం విశేషం. వీరు పెంచుతున్న మొక్కల్లో పూలు, షో మొక్కలతో పాటు పండ్ల చెట్లు కూడా ఉన్నాయి. ప్రధానంగా జామ, నిమ్మ, ఆరెంజ్, ఆరటి, దానిమ్మ, మామిడి, సపోట, పనస, రామసీతాఫలం చెట్లు పెంచుతున్నారు. చెట్ల మధ్య నిత్యం పక్షులు కిలకిలరావాలతో సందడి చేస్తుంటాయి.

భువనగిరిలోని స్రిగ్దకాలనీలో దిడ్డి బాలాజీ ఇంటి ఆవరణలో రకరకాల మొక్కలు

### పచ్చని పొదరిల్లు

ఆత్మకూరు(ఎం): వివిధ రకాల మొక్కలతో ఆహ్లాదంగా కనిపిస్తున్న ఈ గృహం.. ఆత్మకూరు(ఎం)కు చెందిన సోలిపురం అరుణది. చిన్నప్పటి నుంచి ఆమెకు మొక్కల పెంపకం అలవాటుగా మారింది. ఆ.. అలవాటే తన ఇంటి ఆవరణను పూలు, పండ్లు, కూరగాయల చెట్లతో పార్కులా మార్చింది. భర్త సోలిపురం ఉపేందర్ రెడ్డి ప్రోత్సాహంతో ఇంటి ఆవరణలో తీరొక్క మొక్కలు నాటింది. రోజూ చెట్లకు నీళ్లు పట్టడం, పాదులు చేయడం, మొక్క కత్తిరింపు పనులు స్వయంగా చేస్తుంది. తమది వ్యవసాయ కుటుంబం అని, ఎంత బిజీగా ఉన్నప్పటికీ రోజూ కనీసం గంట సమయమైనా మొక్కలు, చెట్ల సంరక్షణకు కేటాయిస్తానని అరుణ చెబుతుంది.



పచ్చని చెట్లతో ఆహ్లాదంగా ఇంటి ఆవరణ, (ఇన్‌సెట్‌లో) సోలిపురం అరుణ

### మొక్క 'రక్షణ' మరువని లక్ష్మీనారాయణ



ఇంటి ఆవరణను హరితవనంగా తీర్చిదిద్దిన రక్షణ శాఖ మాజీ ఉద్యోగి లక్ష్మీనారాయణ దంపతులు

మోత్కూరు : మున్సిపాలిటీ పరిధిలోని బుజిలాపురం గ్రామానికి చెందిన రక్షణ శాఖ మాజీ ఉద్యోగి బిల్లకంటి లక్ష్మీనారాయణ హరిత సేవలోనూ ఆదర్శంగా నిలుస్తున్నాడు. ఏడు సంవత్సరాల క్రితం ఉద్యోగ విరమణ పొందిన లక్ష్మీనారాయణ కుటుంబంతో కలిసి స్వగ్రామంలో ఉంటున్నాడు. ప్రకృతిపై ఉన్న మక్కువతో ఉద్యోగంలో ఉన్న సమయంలో తన క్వార్టర్స్ ఆవరణలో వివిధ రకాలు మొక్కలు పెంచి ఉన్నతాధికారులతో శభాష్ అనిపించుకున్నాడు. రిటైర్డ్ అయిన తరువాత అదే స్ఫూర్తితో స్వగ్రామంలో తన ఇంటి ఆవరణను నందనవనంగా మార్చేశాడు.

**35 రకాల మొక్కలు**

ఔషధ రకాలకు సంబంధించి మారేడు, తులసీ, పూదీన, పారిజాతం, ఉసిరి, కలబంద.. పండ్ల మొక్కలు జామ, మామిడి, బత్తాయి, దానిమ్మ, ఉసిరి, కొబ్బరి ఉన్నాయి. వీటితో పాటు రాధామాధవ్ క్రోటేన్స్, 8 రకాల గులాబీలు, మల్లెలో లిల్లి, గోరింటాకు, నల్లేరు, ఎర్ర, పచ్చ మందారం, తెల్ల, పసుపు, చామంతి, నిత్య మల్లెపూలు, తమలపాకు, గన్నేరు, బిల్ల గన్నేరు, నూరుహారాలు ఇలా రకరకాల పూల మొక్కలు పెంచుతున్నారు. ఇంటి గేట్ పక్కన నాటిన తగజాతి పూలమొక్క పచ్చటి తోరణంలా ఆకర్షణీయంగా మారింది. మొక్కలను లక్ష్మీనారాయణ దంపతులు ప్రాణంగా చూసుకుంటారు.

మరికొన్ని కథనాలు 9లో ▶

### ● శాకాంబరీదేవిగా జ్ఞాన సరస్వతి



ఆశాఢ మాసం పూజల్లో భాగంగా నల్లగొండ పట్టణంలోని తులసి నగర్ భక్తాంజనేయస్వామి ఆలయంలో శనివారం జ్ఞాన సరస్వతి దేవి శాకాంబరీ మాతగా దర్శనమిచ్చింది. - రామగిరి(నల్లగొండ)

## నాఫ్‌స్కాబ్ అసోసియేట్ మెంబర్‌గా 'కుంభం'

నల్లగొండ అగ్రికల్చర్ : నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ స్టేట్ కోఆపరేటివ్ బ్యాంక్స్ లిమిటెడ్(నాఫ్‌స్కాబ్) అసోసియేట్ మెంబర్‌గా నల్లగొండ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం నాఫ్‌స్కాబ్ మేనేజింగ్ డైరెక్టర్ భీమా సుబ్రహ్మణ్యం ఉత్తర్వులు జారీ చేశారు. డీసీసీబీని ప్రగతిపథంలో నడిపించేలా చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి చేసిన కృషికి తెలంగాణ నుంచి ఆయనకు నాఫ్‌స్కాబ్‌లో ప్రాతినిధ్యం కల్పించారు. ఇక నుంచి కోఆపరేటివ్ బ్యాంకులు రైతుల కోసం తీసుకునే నిర్ణయాలలో శ్రీనివాస్‌రెడ్డి కీలక భూమికను పోషించనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాగుతూ తాను రాష్ట్రంలోని సహకార బ్యాంకుల బలోపేతానికి తన వంతుగా కృషిచేస్తామన్నారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.



డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి

# సంక్షేమ హాస్టళ్లకు పక్కా భవనాలు



కలెక్టరేట్‌లో జరిగిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్, చిత్రంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, నల్లగొండ ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వీరేశం, జైవీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, కలెక్టర్లు ఇలా త్రిపాఠి, హనుమంతరావు తదితరులు

- స్థలాలు సేకరిస్తే నిధులు మంజూరు చేస్తాం
- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష
- హాజరైన మంత్రి కోమటిరెడ్డి, గుత్తా, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ

నల్లగొండ: జిల్లాలో 32 సంక్షేమ పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాలు ఉండగా 30 అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారని, వాటికి స్థలాలు సేకరిస్తే నిధులు మంజూరు చేసి పక్కా భవనాలు నిర్మించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం నల్లగొండ కలెక్టరేట్‌లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎంపీ, ఎమ్మెల్యేలతో కలిసి నిర్వహించిన ఉమ్మడి జిల్లాఅధికారుల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాల వారీగా అధికారులు అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న హాస్టళ్లు, పాఠశాలలకు స్థలాన్ని సేకరించి ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. గీత కులవృత్తిని కాపాడేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 40 లక్షల ఈత మొక్కలు, 5 లక్షల తాటి మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. కాటమయ్య రక్షణ కిట్లను ఎక్కువ మందికి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉమ్మడి జిల్లాకు మరో 10 వేల రక్షణ కిట్లు అందిస్తామన్నారు. జిల్లాకు 77 ఎలక్ట్రిక్ బస్సులు మంజూరు చేసి ప్రారంభించామన్నారు. ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ భవనాలు నిర్మించాలని, తద్వారా అద్దె భారం తగ్గుతుందన్నారు. సాగర్ ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి మాట్లాడుతూ సాగర్ డిగ్రీ కాలేజీ భవనాన్ని మార్చాలని, బీసీ హాస్టల్‌కు మరమ్మతులు చేయాలని కోరారు. మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో రద్దయిన బస్‌లు పునరుద్ధరించాలన్నారు. నకిరేకల్ ఎమ్మెల్యే వీరేశం మాట్లాడుతూ నకిరేకల్ నుంచి ముంబై బస్సును పునరుద్ధరించాలన్నారు. మూసీ గురుకుల భవన నిర్మాణం చేపట్టాలన్నారు. ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ మాట్లాడుతూ సంక్షేమ హాస్టల్ భవనాలకు ప్రాధాన్యమివ్వాలన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ జిల్లాలో డ్రైవర్లకు ఉచిత కంటి వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఏడాది ఈత ప్లాంటేషన్‌పై దృష్టి సారించామన్నారు. ఈ సందర్భంగా మంత్రులు గీత కార్మికులకు కాటమయ్య కిట్లు అందజేశారు. అంతకుముందు కలెక్టరేట్ ప్రాంగణంలో మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు మొక్కలు నాటారు. సమావేశంలో యాదాద్రిభువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు, జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్, మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ నారాయణ్ అమిత్, రవాణాశాఖ కమిషనర్ చంద్రశేఖర్‌గౌడ్, అటవీ అధికారి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

**బస్సుల సంఖ్య పెంచాలి : మంత్రి కోమటిరెడ్డి**

రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ నల్లగొండ, మిర్యాలగూడ, నార్కట్‌పల్లి బస్సుల సంఖ్యను పెంచాలని కోరారు. బీసీ సంక్షేమ హాస్టళ్లకు పక్కా భవనాలు నిర్మించే విషయంపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు.

**రోడ్డు ప్రమాదాలను నివారించాలి : గుత్తా సుఖేందర్‌రెడ్డి**

డ్రైవింగ్ లైసెన్స్ ఇచ్చే సమయంలోనే కఠిన నిబంధనలు అమలు చేసి రోడ్డు ప్రమాదాల నివారణకు కృషిచేయాలని శాసన మండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి అన్నారు. యాదాద్రి జిల్లా చౌటుప్పల్ మండల పరిధిలోని దండు మల్కాపురంలో వాహనాల ఫిట్‌నెస్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలన్నారు.



కలెక్టరేట్ ఆవరణలో మొక్క నాటుతున్న మంత్రులు, గుత్తా, ఎంపీ, ఎమ్మెల్యేలు తదితరులు



గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కిట్లు అందజేస్తున్న మంత్రులు, శాసన మండలి చైర్మన్

# మండలం యూనిట్‌గా రిజర్వేషన్లు!

### 'స్థానిక' ఎన్నికల్లో అమలుకు ప్రభుత్వం సన్నాహాలు

- బీసీలకు 42 శాతం కేటాయింపు
- త్వరలోనే తేనున్న ఆర్డినెన్స్
- నెలాఖరులోగా ఖరారయ్యే అవకాశం
- ఆశావహుల్లో తీవ్ర ఉత్కంఠ




నల్లగొండ: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇన్నాళ్లుగా రిజర్వేషన్ల ప్రక్రియ తేలకపోవడంతో ఎన్నికల నిర్వహణకు అడ్డంకిగా మారింది. ప్రస్తుతం అది కూడా తొలగిపోనుండడంతో ఎన్నికలు నిర్వహణకు మార్గం సుగుమమైంది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో ఎన్నడూలేని విధంగా బీసీలకు పెద్దపీట వేసింది. 42 శాతం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించేందుకు ఆర్డినెన్స్ తీసుకురాబోతోంది. ఈనెలాఖరు వరకు రిజర్వేషన్లు ఖరారు కానున్నట్టు తెలుస్తోంది. దీంతో బీసీ వర్గాలు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

| | |
|---|---|
| గ్రామ పంచాయతీలు | 867 |
| జెడ్పీటీసీ స్థానాలు | 33 |
| ఎంపీటీసీ స్థానాలు | 353 |
| మున్సిపాలిటీలు | 08 |

**పాత పద్ధతి రద్దు**

గత ప్రభుత్వం వరుసగా రెండు పర్యాయాలకు రిజర్వేషన్లు ఖరారు చేసిన విషయం తెలిసిందే. అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని సవరణకు పూనుకుంది. పాత రిజర్వేషన్ల పద్ధతిని రద్దు చేసింది. రాష్ట్రంలో బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ అమలుకు రంగం సిద్ధం చేసింది. దీంతో జిల్లా వ్యాప్తంగా గతంలో ఉన్న రిజర్వేషన్లన్ని మారిపోనున్నాయి. ఆయా గ్రామాల్లో గత సంవత్సరం వచ్చిన రిజర్వేషన్లు ఈసారి వచ్చే అవకాశం ఉండదు. జిల్లాలో బీసీలకు 42 శాతం, ఎస్టీలకు 7శాతం, ఎస్సీలకు 15 శాతంతోపాటు అన్ని కేటగిరీల్లో మహిళలకు కూడా రిజర్వేషన్ అమలు చేయాల్సి ఉంది. జిల్లాను, మండలాన్ని యూనిట్‌గా చేసుకుని సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో రిజర్వేషన్లు కేటాయించాలంటే ఆయా ప్రాంతాల్లో ఉన్న ఆయా కులాల జనాభా ఆధారంగా తొలుత మండల పరిషత్‌లకు ఆ తర్వాత గ్రామ పంచాయతీల్లో అమలు చేసే అవకాశం ఉంది. దీంతో గత ప్రభుత్వ హయాంలో కేటాయించిన పాత రిజర్వేషన్లన్నీ మారిపోనున్నాయి. ఇదిలా ఉండగా స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే ఆశావహులు, వివిధ పార్టీల నాయకులు రిజర్వేషన్ల కోసం తీవ్ర ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు.

**రిజర్వేషన్ కేటాయింపు ఇలా..**

గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి మండలాన్ని యూనిట్‌గా తీసుకుని రిజర్వేషన్లు కేటాయించనున్నారు. ఎంపీపీ, జెడ్పీటీసీలకు జిల్లాను యూనిట్‌గా చేసుకుని రిజర్వేషన్లు ఖరారు చేశారు. జెడ్పీ చైర్మన్లకు మాత్రం రాష్ట్రాన్ని యూనిట్‌గా చేసుకుని రిజర్వేషన్లను ఖరారు చేయనున్నారు. గత ఎన్నికల్లో పంచాయతీలకు కూడా రాష్ట్ర స్థాయి యూనిట్‌గా చేసుకుని రిజర్వేషన్లు ఖరారు చేశారు. కానీ, ఈసారి మండలాన్ని, జిల్లాను యూనిట్‌గా చేసుకుని రిజర్వేషన్లు ఖరారు చేసే అవకాశం ఉంది.

# అభినవ గాంధీ 'దొడ్డా' కన్నుమూత

- అనారోగ్యంతో మృతిచెందిన దొడ్డా నారాయణరావు
- స్వాతంత్ర్య ఉద్యమం, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కీలక పాత్ర
- 40ఏళ్ల పాటు ప్రజాప్రతినిధిగా, సీపీఐ ఉమ్మడి జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు


నారాయణరావు (ఫైల్)

చిలుకూరు: సీపీఐ సీనియర్ నాయకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, అభినవ గాంధీగా పేరుగాంచిన దొడ్డా నారాయణరావు కన్నుమూశారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శుక్రవారం అర్ధరాత్రి చిలుకూరులోని ఆయన స్వగృహంలో మృతిచెందారు. నాటి నిజాం నిరంకుశ పాలనకు, బేతవోలు ప్రాంతంలోని జమిందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా ఆయన అనేక పోరాటాలు నిర్వహించి పలుమార్లు జైలుకు కూడా వెళ్లారు. అంతేకాకుండా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నుంచి మొదలుకొని సారా ఉద్యమం వరకు తన ఉద్యమ స్ఫూర్తిని కొనసాగించారు.

**అన్న స్ఫూర్తితో ఉద్యమంలోకి..**

చిలుకూరు గ్రామానికి చెందిన దొడ్డా అప్పయ్య, వెంకమ్మ దంపతులకు ఏడుగురు మగ సంతానం. వారిలో ఆరోవాడు దొడ్డా నారాయణరావు. హుజూర్‌నగర్ మాజీ ఎమ్మెల్యే దొడ్డా నర్సయ్య తమ్ముడే దొడ్డా నారాయణరావు. 1941లో చిలుకూరు రావినారాయరెడ్డి కాలనీలో 8వ ఆంధ్ర మహాసభ నిర్వహించడంలో నారాయణరావు అన్న దొడ్డా నర్సయ్య కీలకపాత్ర పోషించారు. ఆనాడు వడ్డీ వ్యాపారులు దొంగ లెక్కలు, పటేల్ పట్వారీ వ్యవస్థ, అక్రమ శిస్తు వసూలు తదితర దోపిడీలకు వ్యతిరేకంగా ఏర్పాటైన ఆంధ్ర మహాసభ కార్యకర్తలకు దొడ్డా నర్సయ్య నాయకత్వం వహించారు. ఇవన్నీ దొడ్డా నారాయణరావును ప్రభావితం చేశాయి. 1947 కంటే ముందు రజాకార్లకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమంలో కొన్ని సందర్భాల్లో దొడ్డా నర్సయ్య, వేనేపల్లి అంజయ్య లాంటి వ్యక్తులు అజ్ఞాతంలో వెళ్లారు. ఆ సమయంలో దొడ్డా నారాయణరావు స్థానికంగా ఉంటూ వారికి ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తూ ఉండేవాడు. 1948 ప్రారంభంలో చిలుకూరులో ఐదుగురు సభ్యులతో కమ్యూనిస్టు పార్టీ సెల్ ఏర్పాటు చేసి నారాయణరావును కార్యదర్శిగా నియమించారు. స్వాతంత్ర్యం అనంతరం పార్టీపై నిర్బంధం పెరిగింది. దీనికి తోడు రహస్య జీవితం గడుపుతున్న కొంతమంది దళ సభ్యులకు తను సమాచారం అందిస్తున్నట్లుగా రజాకార్లకు తెలిసి అనుమానం వచ్చి నారాయణరావును ప్రశ్నించారు. బేతవోలు మక్తేదారికి వ్యతిరేకంగా నిర్వహించిన పలు ఉద్యమాల్లో ఆయన కీలకపాత్ర పోషించారు.


పాడె మోస్తున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, మాజీ ఎమ్మెల్యే జూలకంటి

**నాలుగు దశాబ్దాల పాటు ప్రజాప్రతినిధిగా..**

చిలుకూరుకు 25 సంవత్సరాలు సర్పంచ్‌గా, ఆ తర్వాత 10 ఏళ్ల పాటు చిలుకూరు మండలానికి ఎంపీపీగా, చిలుకూరు ప్రాథమిక సహకార సంఘం చైర్మన్‌గా 5ఏళ్ల పాటు పనిచేశారు. ఆయన చొరవతోనే చిలుకూరులో గ్రంథాలయం ఏర్పాటైంది. ఉమ్మడి నల్లగొండ జిల్లా సీపీఐ కార్యదర్శిగా వరుసగా రెండు పర్యాయాలు 6ఏళ్ల పాటు పనిచేశారు. ఆ తర్వాత రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా, పార్టీ అనుబంధ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా కూడా పనిచేశారు.

**భార్య మృతితో కుంగిపోయి..**

దొడ్డా నారాయణరావు భార్య సక్కుబాయమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. అప్పటి నుంచి ఆయన మానసికంగా కుంగిపోయారు. ఈ క్రమంలోనే ఆయన అనారోగ్యానికి గురై మృతిచెందారు. నారాయణరావుకు ముగ్గురు కుమారులు సంతానం. వారిలో పెద్ద కుమారులు ఇద్దరు రమేష్, సురేష్ తండ్రి బాటలోనే రాజకీయాల్లో కొనసాగుతుండగా.. చిన్న కుమారుడు శ్రీధర్ మాత్రం లాయర్‌గా పనిచేస్తున్నాడు.

### ప్రభుత్వం నుంచి రూ.50 వేలు ఆర్థికసాయం

దొడ్డా నారాయణరావు అంత్యక్రియలకు ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.50వేలను శనివారం కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ దొడ్డా కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కోదాడ రూరల్ సీఐ రజితారెడ్డి, చిలుకూరు తహసీల్దార్ ధృవకుమార్, ఎస్ఐ సురభి రాంబాబు, ఆర్ఐ మంత్రిప్రగడ సీతరామచందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

### 16 నెలలు జైలు జీవితం

స్వాత్రంత్ర్య ఉద్యమంలో, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కీలకపాత్ర పోషించిన దొడ్డా నారాయణరావు స్వగ్రామంలోని సమస్యలపై కూడా ఉద్యమాలు చేశారు. అనంతరం 1959లో చిలుకూరు గ్రామ ప్రథమ సర్పంచ్‌గా దొడ్డా నారాయణరావు ఎన్నికయ్యారు. భారత్, చైనా యుద్ధం సమయంలో పోలీసులు ఆయనను అరెస్టు చేసి జైలులో ఉంచి 16 నెలల అనంతరం విడుదల చేశారు.

## ఆదర్శప్రాయుడు దొడ్డా నారాయణరావు

కమ్యూనిస్టు యోధుడు దొడ్డా నారాయణరావు ఆదర్శప్రాయుడని సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ అన్నారు. శనివారం దొడ్డా నారాయణరావు అంతిమ యాత్రలో ఆయన పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ.. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కీలకప్రాత పోషించిన మహోన్నత వ్యక్తి దొడ్డా నారాయణరావు అని అన్నారు. ప్రతిఒక్కరూ నారాయణరావును ఆదర్శంగా తీసుకొని ఆయన ఆశయ సాధనకు కృషిచేయాలని అన్నారు. అనంతరం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. నారాయణరావు మృతి సీపీఐకి తీరని లోటని అన్నారు. ఉమ్మడి జిల్లాలో దొడ్డా నారాయణరావుకు చెరగని ముద్ర వేశారని కొనియాడారు.

**అంతిమ యాత్రలో పాల్గొన్న ప్రముఖులు..**

దొడ్డా నారాయణరావు అంతిమ యాత్రలో కోదాడ ఎమ్మెల్యే ఎన్. పద్మావతిరెడ్డి పాల్గొని ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించారు. అదేవిధంగా మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి సీపీఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు వేనేపల్లి చందర్‌రావు, బొల్లం మల్లయ్యయాదవ్, ఉజ్జిని యాదగిరిరావు, జూలకంటి రంగారెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సీపీఐ జాతీయ కౌన్సిల్ సభ్యులు పశ్య పద్మ, వనజ, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్, బొమ్మగాని ప్రభాకర్, సూర్యాపేట, భువనగిరి జిల్లాల సీపీఐ కార్యదర్శులు బెజవాడ వెంకటేశ్వర్లు, శ్రీరాములు, సీపీఐ రాష్ట్ర, జిల్లా నాయకులు ఉజ్జిని రత్నాకర్, పల్లా నరసింహారెడ్డి, ఉస్తెల సృజన, కేవీఎల్, కొండా కోటయ్య, చేపూరి కొండలు, సీపీఐ జిల్లా మాజీ కార్యదర్శి మల్లెల ఆదిరెడ్డి తదితరులు దొడ్డా నారాయణరావు భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలతో నివాళులర్పించారు.


నివాళులర్పిస్తున్న కూనంనేని సాంబశివరావు తదితరులు


నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

# నిర్లక్ష్యంగా వాహనాలు నడిపితే లైసెన్స్ రద్దు


ఆటోమెటిక్ వెహికిల్ టెస్టింగ్ స్టేషన్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్, చిత్రంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కలెక్టర్, ఎస్పీ, ఎంపీ, ఎమ్మెల్యేలు

- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- దండంపల్లిలో ఆటోమెటిక్ వెహికిల్ టెస్టింగ్ స్టేషన్ భవన నిర్మాణానికి శంకుస్థాపన

నల్లగొండ: నిర్లక్ష్యంగా వాహనాలు నడిపి ప్రమాదాలకు కారకులైతే డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేసేలా భవిష్యత్‌లో చర్యలు చేపట్టనున్నట్లు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలోని దండంపల్లి వద్ద రూ.8 కోట్లతో నిర్మించనున్న ఆటోమెటిక్ వెహికిల్ టెస్టింగ్ సెంటర్(ఏటీసీ) భవన నిర్మాణానికి శనివారం రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. వాహనాల వెనుక రిఫ్లెక్టర్ రేడియం స్టిక్కర్లను తప్పనిసరిగా వేసుకునేలా జీఓ తీసుకురానున్నట్లు పేర్కొన్నారు. డ్రైవింగ్‌లో శిక్షణ ఇచ్చేలా ట్రెనింగ్ సెంటర్లను ఏర్పాటు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉందని తెలిపారు. నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం, వాహనాలకు ఫిట్‌నెస్ లేకపోవడంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిని తగ్గించేందుకు ఆటోమెటిక్ వెహికిల్ టెస్టింగ్ స్టేషన్ ఉపయోగపడుతుందన్నారు. రవాణా రంగంలో సాంకేతిక విప్లవాన్ని తీసుకురావాలన్నదే ప్రభుత్వ ధ్యేయమన్నారు. అందులో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా 17ఆటోమెటిక్ వెహికిల్ టెస్టింగ్ స్టేషన్లను ఒక్కో దానిని రూ.8 కోట్లతో ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రవాణా శాఖ ద్వారా స్క్రాపింగ్ పాలసీ తీసుకొచ్చామని, ఏటీసీ వల్ల ప్రతి వాహనం వాహన సారథి పరిధిలోకి వచ్చేలా తెలంగాణ వాహన సారథిలో భాగస్వామ్యం చేశామన్నారు. ట్రాఫిక్ అవేర్‌నెస్‌పై క్యాంపుల నిర్వహణ, పాఠశాల విద్యార్థులకు క్లబ్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. భవిష్యత్‌లో డ్రైవింగ్ లైసెన్స్ టెస్టులు ఆటోమెటిక్‌గా నిర్వహించి ఆ టెస్టులో పాసైతేనే లైసెన్స్ ఇచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు.

### 20 నెలల్లో 200 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణం : మంత్రి కోమటిరెడ్డి

రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు సౌకర్యం వల్ల గడిచిన 20 నెలల్లో 200 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకున్నారు. జిల్లాకు 70 ఎలక్ట్రికల్ బస్సులు వేయగా.. నార్కట్‌పల్లికి 10 బస్సులు, మిగతావి ఇతర ప్రాంతాలకు తిప్పుతున్నట్లు తెలిపారు. నార్కట్‌పల్లికి 80 కొత్త బస్సులు కావాలని అదేవిధంగా నూతన డిపో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి, ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ శ్రీవాణి, నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, బత్తుల లక్ష్మారెడ్డి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్, ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నారాయణ అమిత్ తదితరులు పాల్గొన్నారు.

# సాగర్‌లో 548 అడుగులకు చేరిన నీటి మట్టం

నాగార్జునసాగర్: శ్రీశైలం జలాశయానికి ఎగువ నుంచి వస్తున్న వరద తగ్గుముఖం పట్టడంతో ఒక గేటు ద్వారా దిగువన నాగార్జునసాగర్‌కు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయ గరిష్ట నీటిమట్టం 590 అడుగులు కాగా ప్రస్తుతం 548.60 అడుగుల మేర నీటి మట్టం ఉంది. సాగర్ జలాశయానికి 62,400 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా 1650 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.


548 అడుగుల వద్ద సూచిస్తున్న నీటి మట్టం

## బాలికపై అత్యాచారం

- నిందితుడిపై పోక్సో కేసు నమోదు

మర్రిగూడ : మండలంలోని శివన్నగూడెం గ్రామానికి చెందిన బాలికపై ఇంటి సమీపాన గల యువకుడు అత్యాచారం చేసిన సంఘటన శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పది సంవత్సరాల వయసున్న బాలిక హాస్టల్‌లో ఉంటూ 5వ తరగతి చదువుతోంది. గత నెలలో ఇంటికి వచ్చిన సమయంలో ఇంటి సమీపంలో నివసిస్తున్న యువకుడు డానియేల్ బాలికలకు మాయమాటలు చెప్పి అత్యాచారం చేసి ఎవరికైనా చెప్తే బాగోదని భయభ్రాంతులకు గురిచేశాడు. తిరిగి పాఠశాలకు వెళ్లగా పాఠశాల ఉపాధ్యాయురాలు బాలికకు తీవ్ర కడుపునొప్పి ఉందని తల్లికి సమాచారం అందించడంతో హాస్టల్ నుంచి ఇంటికి తీసుకొచ్చి ఏం జరిగిందని బాలికను తల్లి అడగగా శనివారం విషయం తెలిపింది. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి బాలికను జిల్లా కేంద్రంలోని సఖి సెంటర్‌కు పంపించినట్లు ఎస్ఐ కృష్ణారెడ్డి తెలిపారు.

# యాదగిరిగుట్టకు తరలివచ్చిన భక్తులు


ముఖ మండపం క్యూలైన్‌లో స్వామివారి దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో శనివారం భక్తుల కోలాహలం నెలకొంది. రెండో శనివారం సెలవు రోజు కావడంతో హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చారు. ఆలయ పరిసరాలు, ముఖ మండపం క్యూలైన్, క్యూకాంప్లెక్స్, ప్రసాద విక్రయశాల ప్రాంతాల్లో భక్తులు అధికంగా కనిపించారు. స్వామివారి ధర్మ దర్శనానికి రెండున్నర గంటల సమయం, వీఐపీ దర్శనానికి గంట సమయం పట్టినట్లు భక్తులు తెలిపారు. వివిధ పూజలతో స్వామివారికి నిత్యాదాయం రూ.31,99,413 వచ్చినట్లు ఆలయాధికారులు వెల్లడించారు.

## ఇంట్లో నిల్వ ఉంచిన ముడి పామాయిల్ స్వాధీనం

- ఇద్దరు నిందితులపై కేసు నమోదు

కేతేపల్లి: కేతేపల్లి మండల పరిధిలోని చీకటిగూడెం గ్రామంలో ముడి పామాయిల్ దందా నిర్వహిస్తున్న ఇంటిపై శుక్రవారం రాత్రి స్థానిక పోలీసులు దాడి చేశారు. ఆ ఇంట్లో నిల్వ ఉంచిన ముడి పామాయిల్‌ను స్వాధీనం చేసుకుని దందా నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. కేతేపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చీకటిగూడెం గ్రామ పంచాయతీకి చెందిన కోట భాస్కర్, కిరణ్ గత కొంతకాలంగా ట్యాంకర్ డ్రైవర్ల వద్ద తక్కువ ధరకు ముడి పామాయిల్ కొనుగోలు చేసి ఆటోల్లో తరలించి హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఎక్కువ ధరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ దందాపై పక్కా సమాచారం అందుకున్న కేతేపల్లి పోలీసులు చీకటిగూడెం గ్రామంలోని పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న ఓ ఇంట్లో శుక్రవారం రాత్రి తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆ ఇంట్లో 12 డ్రమ్ముల్లో నిల్వ ఉంచినట్లు గుర్తించారు. పట్టుబడిన ముడి పామాయిల్‌తో పాటు పామాయిల్‌ను రవాణా చేసేందుకు సిద్ధంగా ఉంచిన టాటా గూడ్స్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ముడి పామాయిల్ దందా చేస్తున్న ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని కేతేపల్లి ఎస్ఐ సతీష్ తెలిపారు.

## నిషేధిత అల్ప్రాజోలం మత్తు పదార్థం పట్టివేత

భూదాన్‌పోచంపల్లి: కల్లులో కలిపే నిషేధిత అల్ప్రాజోలం అనే మత్తు పదార్థాన్ని ఓ వ్యక్తి అక్రమంగా స్కూటీలో రవాణా చేస్తుండగా శుక్రవారం సాయంత్రం భూదాన్‌పోచంపల్లి మండలం పిలాయిపల్లి శివారులో ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. భువనగిరి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పి. నరేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. పిలాయిపల్లి గ్రామానికి చెందిన సిద్దగోని రంగయ్య నిషేధిత అల్ప్రాజోలంను స్కూటీలో తరలిస్తుండగా.. పక్కా సమాచారం మేరకు గ్రామ శివారులో ఎక్సైజ్ పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని 250 గ్రాముల అల్ప్రాజోలం స్వాధీనం చేసుకున్నారు. అతడిని విచారించగా.. రంగ శ్రీనివాస్ అనే వ్యక్తి నుంచి అల్ప్రాజోలం కొనుగోలు చేసినట్లు తెలిపాడు. దీంతో సిద్దగోని రంగయ్యతో పాటు రంగ శ్రీనివాస్‌పై కూడా కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. రంగయ్యను శనివారం కోర్టులో రిమాండ్ చేశామని, రంగ శ్రీనివాస్ పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు.

## చెరువులో జారిపడి యువకుడి మృతి


కరుణాకర్ (ఫైల్)

కోదాడరూరల్: బహిర్భూమికి చెరువు వద్దకు వెళ్లిన యువకుడు ప్రమాదవశాత్తు అందులో జారిపడి మృతిచెందాడు. ఈ ఘటన కోదాడ మండల పరిధిలోని కాపుగల్లు గ్రామంలో గురువారం రాత్రి జరిగగా.. శనివారం వెలుగులోకి వచ్చింది. కోదాడ రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాపుగల్లు గ్రామానికి చెందిన కరుణాకర్(33) ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నాడు. అతడు గురువారం రాత్రి గ్రామ పరిధిలోని చెరువు కట్ట వద్దకు బహిర్భూమికి వెళ్లగా.. ప్రమాదవశాత్తు కాలు జారి చెరువులో పడి మృతిచెందాడు. అర్ధరాత్రి అయినా కరుణాకర్ ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు రెండు రోజుల ఎంత వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. శనివారం ఉదయం ఓ వ్యక్తి చెరువు వైపు వెళ్లగా చెరువులో మృతదేహం తేలియాడుతుండటం గమనించి విషయాన్ని గ్రామస్తులకు చెప్పాడు. గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు చెరువు వద్దకు చేరుకొని మృతదేహాన్ని బయటకు తీయగా.. అది కరుణాకర్ మృతదేహంగా గుర్తించారు. మృతుడి తండ్రి నర్సింహారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు కోదాడ రూరల్ పోలీసులు తెలిపారు.

# థర్మల్ విద్యుత్ కేంద్రంలో ట్రయల్‌రన్ విజయవంతం

- నిరంతరాయంగా 72గంటల పాటు విద్యుత్ ఉత్పత్తి

మిర్యాలగూడ: దామరచర్ల మండలం వీర్లపాలెం వద్ద నిర్మాణంలో ఉన్న యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ యూనిట్-1 విద్యుత్ ఉత్పత్తికి సిద్ధమైంది. ఈ నెల 9న ఉదయం 6గంటలకు ట్రయల్ రన్ ప్రారంభించి శనివారం సాయంత్రం వరకు 72గంటలపాటు నిరంతరాయంగా నడిపించారు. ఈ యూనిట్ ద్వారా 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. ఏప్రిల్ 28న తెల్లవారుజామున యూనిట్-1లో అగ్ని ప్రమాదం సంభవించడంతో భారీగా నష్టం వాటిల్లింది. ఈ ప్రమాదంలో విద్యుత్ కేబుల్ వైర్లు, పైపులు కాలిపోవడంతో అప్పుడు నిర్వహించాల్సిన ట్రయల్ రన్ వాయిదా పడగా తిరిగి మరమ్మతులు కొనసాగించారు. పనులు పూర్తికావడంతో ఈ నెల 9న ట్రయల్ రన్ ప్రారంభించారు. ట్రయల్ రన్ విజయవంతమైంది. గతంలో యూనిట్-2 నుంచి 800 మెగావాట్ల విద్యుత్ కొనసాగుతుంది. రెండు యూనిట్లు కలిపి ప్రస్తుతం 1600 మెగావాట్ల విద్యుత్ అందుబాటులోకి వచ్చింది. 3, 4, 5 యూనిట్ల నిర్మాణ పనులు చివరి దశలో ఉన్నాయి. గత సంవత్సరం డిసెంబర్ 7న యూనిట్-2 ప్లాంట్‌ను సీఎం ఎనుముల రేవంత్ రెడ్డి ప్రారంభించి జాతికి అంకితం చేశారు. శుక్రవారం ఇంధనశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ పరిశీలించి ప్లాంట్‌లో 5వ యూనిట్‌ను కూడా వచ్చే ఏడాది జనవరి వరకు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

# గంజాయి విక్రయిస్తున్న నిందితుల అరెస్ట్

- 4కిలోల గంజాయి స్వాధీనం


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సూర్యాపేట సీఐ వెంకటయ్య

సూర్యాపేటటౌన్: గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను సూర్యాపేట పట్టణ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. శనివారం ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం.. కట్టంగూర్ మండలం చెరువు అన్నారం గ్రామానికి చెందిన గండమల్ల దుర్గాప్రసాద్, సూర్యాపేట పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన చెరుకు దీపక్ ఐదు రోజుల క్రితం బైక్‌పై ఏపీలోని సీలేరు ప్రాంతానికి వెళ్లి అక్కడ గుర్తుతెలియని వ్యక్తుల నుంచి కిలో రూ.3వేల చొప్పున నాలుగు కిలోలు గంజాయి కొనుగోలు చేసి సూర్యాపేటకు తీసుకొచ్చి పట్టణంలోని దుర్గాప్రసాద్ రూంలో దాచిపెట్టారు. శుక్రవారం వారిద్దరితో పాటు పట్టణంలోని చర్చి కాంపౌండ్ ప్రాంతానికి చెందిన మహ్మద్ జానీపాషా కలిసి గంజాయి పంచుకోవాలని అనుకున్నారు. ఈ క్రమంలో దుర్గాప్రసాద్ రూం వద్దకు జానీపాషా వచ్చాడు. వారిద్దరు గంజాయి పంచుకుంటుండగా.. పక్కా సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి వారిని పట్టుకున్నారు. చెరుకు దీపక్‌ను తన ఇంటి వద్ద అదుపులోకి తీసుకున్నారు. ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. నిందితుల నాలుగు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

# మంత్రి క్యాంపు కార్యాలయంలో వ్యక్తి ఆత్మహత్యాయత్నం


కరుణాకర్‌ను అడ్డుకుంటున్న పోలీసులు

నల్లగొండ టూటౌన్: నల్లగొండ పట్టణంలోని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఓ వ్యక్తి పెట్రోల్ బాటిల్‌తో వచ్చి ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం కలకలం సృష్టించింది. నల్లగొండ మున్సిపల్ కార్యాలయంలో ల్యాడర్ వాహనానికి ఔట్ సోర్సింగ్ కింద డ్రైవర్‌గా పనిచేసిన కరుణాకర్ శనివారం జిల్లా కేంద్రంలోని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయం వద్ద ఆత్మహత్యాయత్నం చేశాడు. ఏడు నెలల కిత్రం అతన్ని విధుల నుంచి మున్సిపల్ అధికారులు తొలగించడంతో తన ఉపాధి పోయిందని మంత్రిని కలిసేందుకు వచ్చాడు. పెట్రోల్ బాటిల్‌తో రావడంతో దానిని చూసిన పోలీసులు వెంటనే అప్రమత్తం అయ్యారు. అతని చేతిలో ఉన్న పెట్రోల్ బాటిల్‌ను లాక్కున్నారు. వెంటనే అతన్ని నల్లగొండ టూటౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇంకా అప్పటికి క్యాంపు కార్యాలయానికి మంత్రి చేరుకోలేదు. నల్లగొండ పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన ముకిరాల కరుణాకర్ కొంతకాలం డ్రైవర్‌గా ఔట్‌సోర్సింగ్ కింద పనిచేస్తున్నాడు. విధి నిర్వహణలో పలుమార్లు మద్యం సేవించడం కారణంగా ల్యాడర్ పైకి ఎక్కిన ఎలక్ట్రీషన్ కింద పడిపోయినట్లు మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. వీధి దీపాలు, సెంట్రల్ పోల్స్‌కు లైట్లు బిగించడానికి ల్యాడర్ వాహనం ఉపయోగిస్తారు. ల్యాడర్ బకెట్‌లో నిలబడి స్తంభానికి లైట్లు మరమ్మతులు, కొత్తవి అమర్చడం లాంటివి చేస్తుంటారు. అయితే, ల్యాడర్ డ్రైవర్ మద్యం తాగి వచ్చిన కారణంగా ఏడు నెలల క్రితం విధుల నుంచి పూర్తిగా తొలగించినట్లు మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ తెలిపారు. కాగా, స్థానిక నాయకుల కారణంగానే తన భర్తను విధుల నుంచి తొలగించినట్లు బాధితుని భార్య ఆరోపించింది.

# చేతికందొచ్చిన కొడుకును చంపేశారు

- అరుణాచలంలో హత్యకు గరైన విద్యాసాగర్ తండ్రి ఆవేదన


విద్యాసాగర్ (ఫైల్)

మోత్కూరు: చేతికందొచ్చిన తన కుమారుడిని అన్యాయంగా దుండగులు చంపేశారని తమిళనాడు రాష్ట్రంలోని అరుణాచలం దేవాలయం వద్ద హత్యకు గురైన విద్యాసాగర్ తండ్రి చిప్పలపల్లి రవీందర్ ఆవేదన వ్యక్తం చేశాడు. విద్యాసాగర్ ఉద్యోగం చేస్తుండటంతో త్వరలోనే వివాహం చేయాలనుకున్నామని, ఇంతలోనే దుండగుల చేతిలో హత్యకు గురయ్యాడని కన్నీరుమున్నీరుగా విలపించారు. మోత్కూరు పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన చిప్పలపల్లి రవీందర్ హైదరాబాద్‌లో ఎస్‌పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తూ అక్కడే కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నాడు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు విద్యాసాగర్(28) సంతానం. కుమారుడు విద్యాసాగర్ మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పనిచేస్తున్నాడు. విద్యాసాగర్ గతంలో రెండుసార్లు స్నేహితులతో కలిసి తమిళనాడు రాష్ట్రంలోని అరుణాచలం దేవాలయానికి వెళ్లి వచ్చాడు. ఈసారి కూడా వెళ్దామంటే స్నేహితులు రామని చెప్పడంతో.. అతడు ఒక్కడే వెళ్లాలని నిర్ణయించుకున్నాడు. ఈ నెల 4న మోత్కూరుకు వచ్చిన విద్యాసాగర్ 6వ తేదీన ఇక్కడి నుంచి బయల్దేరి 7న అరుణాచలం పుణ్యక్షేత్రానికి చేరుకున్నాడు. 8వ తేదీ రాత్రి విద్యాసాగర్ గిరి ప్రదక్షిణ చేస్తుండగా దోపిడీ దొంగలు అతడిపై దాడి చేసి గొంతు కోశారు. రాత్రంతా కొన ఊపిరితో కొట్టుకుంటూ రోడ్డు పైనే పడి ఉండగా.. 9వ తేదీ ఉదయం స్థానిక పోలీసులు చూసి అతడిని ఆస్పత్రికి తరలించి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. విద్యాసాగర్ తల్లిదండ్రులు 9వ తేదీన అరుణాచలం వెళ్లేసరికి విద్యాసాగర్ ఆస్పత్రిలో మృతిచెంది ఉన్నాడు. 10న పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం పోలీసులు మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించగా వారు స్వగ్రామానికి తీసుకొచ్చి శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు.

## అప్పుల బాధతో బలవన్మరణం

భువనగిరి: అప్పుల బాధతో పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన భువనగిరి మండలం చందుపట్ల గ్రామంలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చందుపట్ల గ్రామానికి చెందిన తోటకూరి మల్లమ్మ (65)కు అప్పులు ఎక్కువ కావడంతో కొద్దిరోజుల నుంచి ఇబ్బందులు పడుతోంది. అప్పుల బాధ భరించలేక శనివారం ఉదయం పురుగుల మందు తీసుకుని తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లి తాగింది. అపస్మారక స్థితిలో పడి ఉన్న ఆమెను స్థానిక రైతులు స్థానికులు గమనించి గ్రామస్తులకు సమాచారం అందించారు. ఆమెను భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి కుమారుడు బాలనర్సింహ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపారు.